రంగు మారింది

● రచ్చబండను పసుపుపచ్చగా మార్చిన వైసీపీ నేతలు





పసుపుపచ్చటి రచ్చబండకు తెల్లరంగు వేశారు. అధికారం ఉంది కదా అని ఇలా రంగుమార్చారు. ఇప్పుడు అధికారం పోగానే మళ్లీ రచ్చబండకు పసుపు వేశారు వైసీపీ నేతలు. ఈ ఘటన రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో చోటుచేసుకుంది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ పార్టీ నేతల తీరు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగింది. తరచూ టీడీపీ శ్రేణులపై దాడులకు పాల్పడటం, బాధితులపైనే పోలీసు కేసులు పెట్టించడం పరిపాటిగా మారింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 89పెద్దూరు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఈ పంచాయతీ పరిధిలోని ఆరిమానిపెంట గ్రామం నడిబొడ్డున దశాబ్దాలుగా పసుపుపచ్చ రంగులో ఉన్న రచ్చబండకు టీడీపీ శ్రేణులు మరోసారి అదే రంగు వేశారు. దీనిపై ఆగ్రహించిన వైసీపీ నేతలు రాత్రికి రాత్రే రచ్చబండకు పసుపుస్థానే తెల్లరంగు వేయించారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఏమైందో ఏమో కానీ బుధవారం వైసీపీ నేతలే తమ సొంత ఖర్చులతో రచ్చబండకు పసుపుపచ్చ రంగు వేయించారు. దీనిపై టీడీపీ శ్రేణులు ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు.

- రామకుప్పం

భక్తుల తలపై పగిలిన టెంకాయలు



తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం బైరెడ్డిపల్లె మండలం పాతూరు నత్తం గ్రామంలోని రేవణసిద్ధేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. మొదట స్వామి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించిన పూజారి.. తర్వాత దేవరెద్దుకు పూజలు చేశారు. కురబ కులస్థుల సంప్రదాయం ప్రకారం ఉపవాసదీక్షలోని భక్తుల తలలపై పూజారి టెంకాయలు పగలగొట్టారు. శివనామస్మరణల మధ్య వివిధప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాన్ని భక్తిపారవశ్యంతో తిలకించారు. ఆలయంవద్ద అన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జడ్పీటీసీ రాధమ్మ, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, మండల ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కురబసంఘం నాయకులు నాగభూషణం, గౌరప్ప, శివకుమార్, సుబ్రమణ్యంగౌడు తదితరులు పాల్గొన్నారు.

- బైరెడ్డిపల్లె

ఇటీవల కుప్పం రెస్కోలా వార్తల్లోకెక్కిన సంస్థ ఏదీ లేదు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యలు, చేతులు మారిన ముడుపులు.. పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వార్తలుగా మారి రచ్చకెక్కాయి. వీటన్నింటిపై సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని ప్రభుత్వం విచారణాధికారిగా నియమించింది. ఆమె గురువారం విచారణ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏ అవినీతి చర్య బయటపడి, ఎవరికి మూడుతుందో, ఎవరి కొలువుకు ఎసరు వస్తుందోనని సంస్థ ఉద్యోగులు వణుకుతున్నారు.

- కుప్పం



కుప్పం రెస్కో

ఎవరికి మూడుతుందో!

ఏ అవినీతి బయట పడుతుందో?

ఉద్యోగుల్లో దడ దడ

నేడు ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి విచారణ

కుప్పం రెస్కోలో అవినీతి, అక్రమాలపై గురువారం విచారణాధికారి శ్రీలక్ష్మి విచారణ చేపట్టనున్నారు. ఈ క్రమంలో మాజీ ఎండీ సుబ్రమణ్యం.. అర్హత, సీనియారిటీ లేకపోయినా ఎండీ కుర్చీ ఎక్కి ఇప్పుడు తాజా మాజీగా మారిన ప్రభాకర్.. వీరిద్దరి చర్యలకు అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో ఉండి ఫైల్స్ తయారీలో సహకరించిన సీనియర్ అసిస్టెంట్.. ఒక ఏఏవో.. ఇంకా పేర్లు బయటపడని ఒకరిద్దరు ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం మారగానే విచారణాధికారిగా వచ్చిన డీఎల్‌సీవో ఆనంద్ మీద కూడా గతంలో జరిగిన అక్రమాలకు వత్తాసు పలికారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణనుంచి ఆయన్ను పక్కకు తప్పించారు. మధ్యలో పర్సన్ ఇన్‌ఛార్జి జేసీ పి.శ్రీనివాసులుకు సహకార వ్యవస్థ పట్ల అంతగా అవగాహన లేకపోవడంతో పైపైన విచారణ జరిపి వెళ్లిపోయారు. ఇప్పుడు ఎండీగా తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ సోమశేఖర్ నియమితులయ్యారు. ఈయనకూ సహకార వ్యవస్థ పట్ల అంతగా అవగాహన లేదు. దీంతో ప్రభుత్వం సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని విచారణాధికారిగా నియమించింది. ఈమె గురువారం కుప్పంలోని రెస్కో ప్రధాన కార్యాలయానికి వచ్చి విచారించనున్నారు. తన విచారణకు ఏమేం అవసరమో ఈనెల 11నే రెస్కో ఎండీకి ఆమె లేఖ రాశారు. 2019-20 సంవత్సరపు సంస్థ ఆడిట్ నివేదికతోపాటు, సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ద్వారా తన దృష్టికి వచ్చిన అవకతవకలు, చేసిన ఆరోపణలతోపాటు పి.మనోహర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు, ఇతర అక్రమాలు, ఆరోపణలు వేటిపైనైనా విచారణ చేసే అధికారం తనకు దఖలు పడినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. రెస్కో బైలా, సర్వీస్ బైలా కాపీలు, 2010 నుంచి చేసిన సవరణల వివరాలు తేదీలు, ఆర్డర్లు, లైసెన్సులు, విద్యుత్తు సరఫరా, 2019 నుంచి సంవత్సరాల వారీగా బడ్జెట్లు, క్యాడర్ స్ట్రెంత్, పదోన్నతులు, జనర్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, ప్రాజెక్ట్ ఇంజినీరు పి.సుబ్రమణ్యం సర్వీస్ వివరాలు, సిబ్బంది జీతభత్యాల పెంపు, గ్రాడ్యుటీల చెల్లింపు తదితర సర్వ వివరాలతో కూడిన ఫైళ్లు తనకు సమర్పించాలని విచారణాధికారి తన లేఖలో కోరారు. తాను చేపట్టబోయే విచారణకు రెస్కో ఎండీ సహా అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై ఫైళ్లను సమర్పించాలని ఆదేశించారు.

రెస్కో కార్యాలయానికి భద్రత : రెస్కోలో గురువారం సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మి విచారణ చేపట్టనున్న నేపథ్యంలో కుప్పంలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి పోలీసు భద్రత కల్పించారు. ముందుజాగ్రత్తగా కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు కార్యాలయం వద్ద ఇద్దరు కానిస్టేబుల్స్‌ను బుధవారం నుంచి నియమించారు. ఫైల్స్ ఎత్తుకెళ్లడం, లేదా కాల్చివేయడం, ఇతరత్రా మార్గాల ద్వారా ధ్వంసం కాకుండా ఉండడానికి ఈ చర్యలు తీసుకున్నారు. బుధవారం మొహర్రం సందర్భంగా సెలవు అయినా సరే, కొంతమంది ఉద్యోగులు కార్యాలయానికి వచ్చివెళ్లారు.

విజిలెన్స్ దాడుల పరమార్థం ఏమిటి?

రెస్కోలో గురువారం రాష్ట్ర స్థాయి సహకార సంఘాల అధికారి శ్రీలక్ష్మి విచారణ నిమిత్తం కుప్పం రానున్నారు. ఈ మధ్యలో తిరుపతి ట్రాన్స్‌కోకు చెందిన విజిలెన్స్ అధికారులు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం వచ్చి రాత్రి 10.30 గంటలదాకా రెస్కో కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించారు. ఒకరిద్దరు బాధ్యులైన ఉద్యోగులను పిలిపించి వారి ఆస్తిపాస్తులను గురించి ప్రశ్నించినట్లు సమాచారం. ఎక్కడ ఏ ఆస్తి ఉన్నదీ స్పష్టంగా పేర్కొంటూ, ఉద్యోగులు పొందుతున్న వేతనానికి.. ఆస్తులకు మధ్య వ్యత్యాసాన్ని ఎత్తి చూపినట్లు చెబుతున్నారు. నిజానికి మరోరోజు కూడా తనిఖీలు జరగాల్సి ఉంది. కానీ సంస్థలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యలపట్ల స్పష్టంగా అప్పటికే ఒక అవగాహనకు వచ్చిన అధికారులు, సంబంధిత ఫైళ్ల జిరాక్సు కాపీలు తీసుకుని అదేరోజు రాత్రి వెళ్లిపోయారు. ఒకవైపు సహకార వ్యవస్థకు చెందిన ఉన్నతాధికారి విచారణకు వస్తుండగా మరోవైపు ఇలా ట్రాన్స్‌కోకు చెందిన విజిలెన్స్ విభాగం తనిఖీలు నిర్వహించడం ఉద్యోగుల్లో మరింతగా గుబులు పుట్టిస్తోంది.

రెస్కోలో అక్రమాలు మచ్చుకు కొన్ని

- మాజీ, తాజా మాజీ ఎండీలు అర్హత లేకుండానే పదోన్నతులు పొందడం.
- నిబంధనలకు విరుద్ధంగా 122 మంది ఉద్యోగుల నియామకం.
- ఎన్నికల నోటిఫికేషన్‌కు మూడు రోజుల ముందు 52 మందికి కల్పించిన పదోన్నతులు.
- వి.కోటలో నిధుల దుర్వినియోగానికి పాల్పడి ఏడాదిపాటు సస్పెండైన సీనియర్ అసిస్టెంట్, పదోన్నతి పొందడం. సర్వీసు రిజిస్టర్ మాయం చేసిన ఇదే ఉద్యోగిని పక్క మండలానికి బదిలీ చేసి చేతులు దులుపుకోవడం.
- మొదట రెస్కో ఛైర్మన్, తర్వాత అప్పటి ఎండీ సుబ్రమణ్యం వాడిన స్కార్పియో వాహనం మెయింటినెన్స్, డీజిల్ ఖర్చులకు అధికంగా బిల్లులు చేయడం.మరో వాహనం డీజిల్ ఖర్చులనూ అధికంగా చూపి స్వాహా చేయడం.
- మెటీరియల్ కొనుగోళ్ల టెండర్లలో అక్రమాలు.
- లక్షలాది రూపాయల విద్యుత్తు బిల్లుల నగదు స్వాహా చేయడం.

రక్తతర్పణం



ఆవలకొండ వీధుల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న షియా ముస్లింలు

మొహర్రం సందర్భంగా బుధవారం జిల్లాలోని షియా ముస్లింలు పీర్లు ఊరేగించి, రక్తతర్పణం(అజాదారిమాతం) నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్, వారి కుటుంబీకులు, బంధువులు, అనుచరుల ప్రాణాలను అప్పటి పాలకుడు యజీద్ బలిగొన్నాడు. అలా ప్రాణాలు అర్పించిన వీరి కోసం శోకతప్త హృదయంతో రక్తతర్పణం చేపట్టారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో మొహర్రం సందర్భంగా 10వరోజు అంజుమన్ అబ్బాషియా కమిటీ, అబ్బాషియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబుదాలి, నబీల్ మీర్జా అధ్యక్షత వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పలువురు నల్లదుస్తులు ధరించి అబ్బాషియా అసుఖానాలో ప్రార్థనలు చేశారు. ఆవలకొండ తూగుండ్రం హైస్కూల్ మలుపు, తూగుండ్రం ఫకీర్ తోట వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు చిన్నారులు, యువకులు, పెద్దలు పదునైన చాకులు, బ్లేడ్లతో తమ ఛాతీ, వీపుపై కొట్టుకుంటూ రక్తతర్పణం నిర్వహించారు. రక్తం చిందిస్తున్న వారిపై నీళ్లు చల్లుతుండగా.. తారురోడ్డుసైతం ఎరుపెక్కింది. తూగుండ్రం ఫకీర్‌తోటవద్ద గల అగ్నిగుండం చుట్టు షియా ముస్లిమ్‌లు పీర్లతో ఊరేగింపుగా తిరిగారు. అక్కడా రక్తతర్పణం గావించి ప్రార్థనలు చేసి మొక్కులతో ముగించారు. ఈ సందర్భంగా చిత్తూరు తాలుకా సీఐ కుళ్లాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ పీర్లు ఊరేగింపులో వివిధ ప్రాంతాల నుంచి షియా ముస్లింలు తరలివచ్చారు. అంజుమన్ అబ్బాసియా కమిటి ఛైర్మన్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గులాంహుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి రహమత్ అలీ, కోశాధికారి షాకీర్ అలీ, స్థానిక షియా ముస్లింలు పాల్గొన్నారు.

- గంగాధరనెల్లూరు





తూగుండ్రం హైస్కూల్ మలుపువద్ద చాకులు, బేడ్లతో కొట్టుకుంటూ రక్తం చిందిస్తున్న షియా ముస్లింలు

ఎన్టీఆర్ బేబీ కిట్.. పురిటి బిడ్డ సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడే పథకమిది. దీనిని 2016 జూలై ఒకటిన టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. వైసీపీ అధికారంలోకి రాగానే 'వైఎస్ఆర్ బేబీ కిట్'గా పేరు మార్చారు. కొంతకాలం ఇచ్చి.. ఆ తర్వాత నిలిపేశారు. ఇప్పుడు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పేద బాలింతల ఆశలు చిగురిస్తున్నాయి.



చిత్తూరు మెటర్నిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలు

బేబీ కిట్టు.. కనిపిస్తే ఒట్టు

● వైసీపీ పాలనలో సరఫరా నిలిపివేత ● బయట మార్కెట్‌లో కొంటున్న పేదలు

● కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు

ఒక జిల్లా ఆస్పత్రి, ఆరు సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలోనే నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా 2016 నుంచి టీడీపీ ప్రభుత్వం బేబీ అందిస్తోంది. ఆస్పత్రిలో ప్రసవానంతరం శిశువు కోసం ఎన్టీఆర్ పేరిట బేబీ కిట్టు ఇచ్చేది. ఈ కిట్టులో శిశువుల సంరక్షణకు అవసరమైన టవల్, హ్యాండ్ వాష్ లిక్విడ్, బేబీ పరుపు, దోమతెర ఇలా నాలుగు రకాల వస్తువులు ఉంటాయి. 2019లో అధికారంలోకి వచ్చి వైసీపీ.. ఈ కిట్‌ను వైఎస్ఆర్ బేబీ కిట్‌గా పేరుమార్చింది. 2020 ఫిబ్రవరి వరకు ఈ కిట్లను పంపిణీచేసి.. ఆపై అనేక కారణాలు చెప్పి నిలిపివేసింది. దీంతో పేదలు రూ.వెయ్యి నుంచి రూ.1500 చెల్లించి బయట బేబీ కిట్లను కొంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా సుమారు లక్ష మందికి పైగా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగినట్లు గణంకాలు చెబుతున్నాయి. దాదాపు పేదలే ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రసవాలకు వస్తుంటారు. అలాంటి పేద తల్లుల పిల్లలకు బేబీ కిట్లు పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లో కరోనా సాకు చూపి బేబీ కిట్లకు నిలిపి వేశారు. కరోనా పోయిన తర్వాత కూడా బేబి కిట్ల ఊసే లేదు. దీంతో చేసేది లేక పేద తల్లులు వందల రూపాయాలు వెచ్చించి బేబీకిట్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన కార్యక్రమం కావడంతో బాలింతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- చిత్తూరు రూరల్

తిరిగి ప్రారంభిస్తే సంతోషిస్తాం



పలమనేరుకు చెందిన విజయ్‌కుమార్ భార్య శేష బుధవారం బిడ్డకు జన్మనిచ్చారు. అసలే వర్షాలు పడుతుండటంతో దోమల బెడద ఎక్కువ. పురిటి బిడ్డ సంరక్షణకు దోమతెర తదితరాలను బయట కొనాల్సి వచ్చింది. రెక్కాడితేకానీ డొక్కాడని వీరి కుటుంబానికి రూ.1200 పెద్ద విషయమే. 'చంద్రబాబు నాయుడు మొదలు పెట్టిన ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తారని ఆశిస్తున్నాం. అలా జరిగితే నాలాంటి ఎందరో పేదలకు మేలు జరుగుతుంది' అని ఆమె పేర్కొన్నారు.

రూ.1000 పెట్టి కొన్నారు

వీరిది నేపాల్ దేశం.బతుకుదెరువు కొసం చిత్తూరులోని ఓ అపార్ట్‌మెంట్‌లో తేజ్‌పాల్ వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. ఈయన భార్య బసంతి బుధవారం ఉదయం రెండో బిడ్డకు జన్మనిచ్చారు. పుట్టిన బిడ్డ కోసం దోమతెర, టవల్, స్లీపింగ్ బెడ్ తదితరాలను సుమారు వెయ్యి రూపాయలు పెట్టి కొన్నారట. వాచ్‌మాన్‌గా ఉన్నవీరికి ఆ మొత్తం వెచ్చించడమూ ఇబ్బందే.బేబీ కిట్లను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తూ ఉండుంటే.. దీనికి కొనసాగింపుగా ఇప్పుడూ వీరికి అందేది. రూ. వెయ్యి ఖర్చు తగ్గిఉండేది.



ముగ్గురు ఆర్డీవోల చుట్టూ ఓటరు జాబితా వివాదం

- తహసీల్దార్లు, బీఎల్వోల లాగిన్ ఐడీలన్నీ వైసీపీ నేతలకు అప్పగింత
- ప్రైవేటు కార్యాలయాల నుంచీ చంద్రగిరి ఓటర్ల చేర్పులు, తొలగింపులు
- ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థుల ప్రమేయం
- విచారణకు ప్రత్యేకాధికారిని నియమించే అవకాశం



తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని ఎన్నికలకు ముందు నుంచీ టీడీపీ వర్గీయులు గగ్గోలు పెడుతున్న వ్యవహారంలో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పేరు తెరమీదకు వస్తున్నాయి.గత ఐదేళ్లలో ఎక్కువ కాలం పాటు తిరుపతి ఆర్డీవోగా కనక నరసారెడ్డి పనిచేశారు. ఆయన గతేడాది సెప్టెంబరులో బదిలీ కావడంతో తర్వాత ప్రస్తుత ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఆ స్థానంలో నియమితులయ్యారు. 2017-18 మధ్య తిరుపతి రూరల్ తహసీల్దారుగా పనిచేసిన మీసాల కిరణ్‌కుమార్ ఆ సమయంలో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డికి సన్నిహితంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అప్పటి నుంచే 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపుకోసం అనుకూలంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రణాళిక వేసినట్టు టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. తర్వాత డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రాగా చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. తర్వాత గూడూరు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూ కూడా తరచూ చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా తయారీలో జోక్యం చేసుకున్నారని, దాదాపు ఆయనే పర్యవేక్షించేవారని చంద్రగిరి టీడీపీ ఇంఛార్జి పులివర్తి నానీ ఎన్నికల ముందు ఈసీకి, ప్రభుత్వానికి అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. తిరుపతి ఆర్డీవోగా కనకనరసారెడ్డి కూడా చెవిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన తర్వాత వచ్చిన ప్రస్తుత ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా అదే పంథా అవలంబించారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో చంద్రగిరి ఓటరు జాబితాలో బోగస్ ఓటర్ల చేర్పులు, టీడీపీ అనుకూల ఓటర్ల తొలగింపులకు వీరిదే ప్రధాన బాధ్యత అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

తిరుపతి, బెంగళూరు నుంచీ మార్పుచేర్పులు

తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రైవేటు కార్యాలయం నుంచీ ప్రధానంగా ఓటర్ల జాబితా మార్పుచేర్పులు జరిగాయని టీడీపీ నేతలు ఫిర్యాదుల్లో ఆరోపించిన విషయం తెలిసిందే. అక్కడ చెవిరెడ్డి వద్ద పీఆర్వోగా పనిచేసిన ఓ రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ పాత్ర కూడా కీలకమని ఫిర్యాదుల్లో ఆరోపించారు. అలాగే బెంగళూరులో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపార భాగస్వాముల కార్యాలయాల నుంచీ ఈ పనులు జరిగాయని తాజా ఫిర్యాదుల్లో ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసిల్దార్లు, బీఎల్వోలు, ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసిల్దారు లాగిన్ ఐడీలు, పాస్ వర్డులను ఈ రెండు ప్రైవేటు కార్యాలయాల సిబ్బందికి అందజేశారని, వాటి ఆధారంగా బోగస్ ఓటర్లను భారీ ఎత్తున చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం జరిగిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. జాబితాలో చేర్పులు, తొలగింపుల వ్యవహారం చేపట్టడానికి తిరుపతిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థులను వినియోగించారని, ఆ సంస్థ యజమాని అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన వారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందరినీ విచారించనున్న సీఐడీ అధికారులు

గత ఐదేళ్లలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డిలతో పాటు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు విచారించనున్నారు. అలాగే ఆరు మండలాల తహసిల్దార్లు, బీఎల్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన విద్యార్థులను కూడా ప్రశ్నించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ కాల్ డేటాను పరిశీలించాలని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్న నేపధ్యంలో దానిపైనా దృష్టి సారించే ఆస్కారం వుంది. తిరుపతిలోని చెవిరెడ్డి ప్రైవేటు కార్యాలయానికి ఆయన తరచూ రావడం, ఆరు మండలాల తహసిల్దార్లను అక్కడికి పిలిపించుకోవడం వంటి వాటికి సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా తమ వద్ద వున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. కాల్ డేటాను కూడా విశ్లేషించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సీఐడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రత్యేకాధికారి నియామకానికి సీఎం చొరవ

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో వెలుగు చూసిన ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడింగ్, నకిలీ ఓటరు కార్డుల తయారీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా అక్రమాలు కూడా తెలియడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఈ రెండు అంశాలను కేస్ స్టడీలుగా తీసుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగా తిరుపతి, చంద్రగిరి ఓటర్ల జాబితాల అక్రమాలపై లోతుగా విచారణ జరిపించేందుకు ప్రత్యేకాధికారిని నియమించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది.వైసీపీ నేతలు చాలా తేలిగ్గా తీసుకుని ఓటర్ల జాబితాలో ఇష్టానుసారం అక్రమంగా మార్పుచేర్పులు చేయించారని, అయితే తాజాగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పరిణామాలు ఆషామాషీగా వుండవని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాలకు బాధ్యులైన వారిపై తీవ్రస్థాయి చర్యలే వుంటాయని చెబుతున్నాయి. దీన్నిబట్టి రానున్న రోజుల్లో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయని భావించాల్సి వస్తోంది.

బైక్ దొంగ అరెస్టు

12 ద్విచక్ర వాహనాల స్వాధీనం



నిందితుడిని చూపుతున్న సీఐ రవిశంక్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 17: కాణిపాకం పోలీసులు బుధవారం బైక్ దొంగను అరెస్టు చేసి, అతని నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో చిత్తూరు వెస్టు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. మద్దిపట్లపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ కోటీశ్వర్(కోటి) పట్టుబడినట్లు తెలిపారు. అతను ఇప్పటివరకు చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, కాణిపాకం, రేణిగుంట ప్రాంతాలలో చోరీలు చేసినట్లు వివరించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి, వాహనాలను స్వాధీన పరచుకున్నట్టు వెల్లడించారు. కేసు ఛేదించిన కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్‌ను సీఐ అభినందించారు.

ఏనుగుల గుంపు స్వైరవిహారం



బూరగపల్లె సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంట

చౌడేపల్లి, జూలై 17: చౌడేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసి పలు పంటలను ధ్వంసం చేశాయి. మంగళవారం రాత్రి పందిళ్లపల్లె, చుక్కావారిపల్లె సమీపంలోని బురగపల్లెకు చెందిన మునిరాజా, పార్వతమ్మల రెండు ఎకరాల టమోటా తోటలో తిరగాడి పంటను తొక్కివేశాయి. వెంకటరెడ్డికి చెందిన ఎకరా టమోటా, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. అంజిరెడ్డి, రామచంద్రారెడ్డికి చెందిన టమోటా తోటల్లో తిరగాడి పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో మంత్రి కొల్లు



ఐరాల(కాణిపాకం), జూలై 17: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం కాణిపాక వరసిద్ధుడిని కటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అభిషేక సేవలో పాల్గొన్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాయకులు గిరిధర్‌బాబు, మధుసూదనరావు, లత, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల కేంద్రాల్లో.. తక్కువ ధరకే నిత్యావసర సరుకులు



టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 17: ధరల నియంత్రణలో భాగంగా జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి మండల కేంద్రాల్లో బియ్యం, కందిపప్పు, పామోలిన్ విక్రయించేలా చర్యలు చేపట్టాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ డీటీలు, డీఎస్వో శంకరన్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మోహన్ బాబుకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతు బజార్‌లో తక్కువ ధరకే బియ్యం (స్టీమ్ రకం రూ.49, పచ్చిబియ్యం రూ.48), కందిపప్పు కేజీ రూ.160, పామోలిన్ ఆయిల్ (ప్రియా బ్రాండ్) లీటరు రూ.90కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు తెరచి విక్రయాలు ప్రారంభించాలని సూచించారు.

22 నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

చిత్తూరు (సెంట్రల్), జూలై 17: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యావిధానం, సంస్కరణలు తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. 22న బోధన, అభ్యసన సామగ్రిని టీచర్లు ప్రదర్శించాల్సి ఉంది. 27న అమ్మతో కలిసి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటాలి. 28న విద్యార్థులతో కలసి టీచర్లు సహపంక్తి భోజనం చేయాలి. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియజేయాల్సి ఉంది.

వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి రైతులకే అప్పగిస్తాం: మంత్రి



కమ్మపల్లెలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సోమల, జూలై 17: వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి ఆ రైతులకు అప్పగిస్తామని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమల మండలం కమ్మపల్లెలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పుంగనూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, రైతులపై దాడులు, టీడీపీ వారిపై అక్రమ కేసుల నమోదు రికార్డు స్థాయిలో జరిగాయన్నారు. దౌర్జన్యపూరితమైన పాలనకు భయపడి రైతులు గప్‌చుప్‌గా ఉండిపోయారన్నారు. గత ఐదేళ్లలో భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత రెండింతల ధరలకు ప్రభుత్వానికి విక్రయించారన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురు కార్యదర్శులు తమ పెండింగ్ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గం టీడీపీ, బీజేపీ ఇన్‌చార్జులు చల్లా రామచంద్రారెడ్డి, గన్నా మదన్‌మోహన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, శీలం రామూర్తి, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, రమేశ్ నాయుడు, బాల సుబ్రమణ్యం నాయుడు, రామనాథం నాయుడు, అష్రఫ్ అలీ పాల్గొన్నారు.

గవర్నర్ ఆదేశించినా..!

- చదువుల తల్లికి అందని ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్
- ఉన్నత విద్యను ప్రోత్సహించని ఎస్వీయూ అధికారులు
- న్యాయం చేయాలంటూ రాష్ట్రపతికి పుంగనూరు విద్యార్థిని ఫిర్యాదు



ఉష

పుంగనూరు, జూలై 17: ఉన్నత విద్యకు ప్రోత్సాహకంగా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్ ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించినా తిరుపతి ఎస్వీయూ అధికారులు పట్టించుకోలేదని పేద విద్యార్థిని ఉష పేర్కొన్నారు. దీనిపై బుధవారం ఆమె మాట్లాడారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. పుంగనూరు కోనేటిపాళ్యంకు చెందిన క్షురక వృత్తి చేసుకునే ఎం.ఉమాశంకర్ కష్టపడి కుమార్తె ఎం.ఉషను బీఎస్సీ, కుమారుడు జితేంద్రను బీటెక్ చదివించారు. ఉష డిగ్రీలో 90శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులో 2021లో చేరారు. మొదటి సంవత్సరంలోనే ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసినా విద్యాదీవెన వస్తుండటం వల్ల ఇవ్వడం కుదరదని నిరాకరించారు. 2021 నవంబరు 5న అప్పటి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదు చేయగా ఆయన అదే ఏడాది డిసెంబరు 29వ తేది ఎస్వీయూ వీసీకి లేఖపంపుతూ పేదవిద్యార్థిని చదువుకు స్కాలర్‌షిప్ ఇప్పించాలని ఆదేశించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆమె వాపోయారు. 80 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైనా (యూజీసీ నిబంధన ప్రకారం 60 శాతం ఉన్నా) గోల్డ్‌మెడల్ ఇవ్వలేదన్నారు. పీహెచ్‌డీ చేయాలని ఏపీఆర్‌సెట్ రాసినా అర్హత సాధించలేదన్నారు. గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసినా తనకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో గత నెల 26వ తేది రాష్ట్రపతి ద్రౌపతిముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంశాఖమంత్రి అమిత్‌షా, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, గవర్నర్ నజీర్‌అహ్మద్, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లా కలెక్టర్‌లకు లేఖలు పంపానని తెలిపారు. ఉన్నత చదువుపై ఆసక్తితో ఉన్న తనను ప్రభుత్వం ప్రోత్సహించేలా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌తో బాటు అర్హతను బట్టి ఎస్వీయూ గోల్డ్‌మెడల్, పీహెచ్‌డీకి అవకాశం ఇవ్వాలని ఉష కోరారు.

మద్యం మత్తులో దూడను చంపేశాడు

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు



చనిపోయిన దూడ - నిందితుడిని చెట్టుకు కట్టేసిన స్థానికులు

గుడుపల్లె, జూన్ 17: మద్యం మత్తులో ఓ వ్యక్తి లేగ దూడను గాయపరచి చంపిన ఘటన గుడుపల్లె మండలం చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు...అత్తినత్తం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు బిసానత్తం సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కర్ణాటక రాష్ట్రం టేకల్‌కు చెందిన మునిస్వామికి కౌలుకు ఇచ్చాడు. మునిస్వామి తన కుటుంబంతో ఈ భూమిలో వ్యవసాయం చేసుకొని పాడి ఆవులను పెంచుకొంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఒంటిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(44) కాడేపల్లెకు చెందిన తన స్నేహితుడు వెంకటేశుతో కలిసి కర్ణాటక సరిహద్దు బిసానత్తం సమీపంలో ఉన్న మద్యం షాపు చేరుకొని మద్యం సేవించారు. కొంత సమయం తరువాత వెంకటేశు తన గ్రామానికి వెళ్లిపోయాడు. సుబ్రహ్మణ్యం అక్కడే ఉండి అతిగా మద్యం సేవించి కాలినడకన తన గ్రామానికి బయలుదేరాడు. అదే దారిలో రోడ్డు పక్కన మునిస్వామి తన పాడి ఆవులు, దూడను చెట్టు కింద కట్టేసి ఉంచాడు. లేగ దూడ అరవడం గమనించిన సుబ్రహ్మణ్యం మద్యం మత్తులో ఆ దూడపైకి దూకి గాయపరిచి చంపేశాడు. పాడి ఆవులు అరుపులు చేయడంతో గమనించిన వేణుగోపాల్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని పరిశీలించగా దూడ గాయాలతో చనిపోయి ఉండడం గమనించారు. అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యంను వీరు ప్రశ్నించగా మద్యం మత్తులో ఇతడు వారిపై దాడి చేయసాగాడు. దీంతో వేణుగోపాల్ కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో సుబ్రహ్మణ్యంను బంధించి చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జీవాల చోరీ ముఠా అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంగవరం, జూలై17: జీవాలను అపహరించి.. వాటిని విక్రయించి సొమ్ము చేసుకొని జల్సాలకు పాల్పడే ముఠాను గంగవరం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ నిందితులను అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లాలో జీవాలు దొంగలించడమే పనిగా పెట్టుకున్న ముఠా.. తర్వాత పెద్దపంజాణి మండలానికి మార్చుకొని దొంగతనాలు ప్రారంభించింది. రెండునెలల కాలంలో పెద్దపంజాణి, గంగవరం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో 112జీవాలు చోరీకి గురయ్యాయి. బాధితులు వరుసగా ఫిర్యాదులు చేయడంతో కేసు నమోదు చేసి గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు, ఐడీ పార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె క్రాస్ వద్ద ఐదుగురు ఒక లగేజ్ వాహనంలో జీవాలను లోడ్ చేసుకుంటున్నారని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అనంతపురం జిల్లా రాప్తాడు మండలానికి చెందిన ఎరికల చంద్రశేఖర్ (30), దేరంగుల విజయ్ (20), ఎరుకుల వాసు (25), బెస్త రాకేష్ (22), అనంతపురం టౌన్‌కు చెందిన శెట్టి సురేంద్ర(21)లను అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు. చోరీ చేసిన జీవాలను మదనపల్లె శివారులో కట్ చేసి కిలోల లెక్కన విక్రయించి సొమ్ము చేసుకొనేవారిమని, జీవాలను దొంగలిస్తే పట్టించుకోరనే ధీమాతోనే దొంగతనాలకు పాల్పడ్డామని పోలీసుల ఎదుట అంగీకరించారు. పట్టుబడిన ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి చోరీలకు గురైన 82 జీవాలు, 1.72 లక్షల నగదుతోపాటు రెండు వాహనాలతో కలసి మెత్తం 9.29 లక్షల సొమ్మును సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచామన్నారు. ఈ ముఠాను పట్టుకోవడానికి కృషిచేసిన సీఐ చిన్నగోవిందు, ఏఎస్ఐ శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ, అశోక్, అల్లాఉద్దీన్, సశిధర్, శేషాచలంలను డీఎస్పీ అభినందించి రివార్డులకు సిఫారసు చేస్తున్నట్లు ప్రకటించారు.

టీటీడీ అధికారుల అత్యుత్సాహం

- పొగాకు ఉత్పత్తులు సీజ్ చేయడంపై తిరుచానూరు వ్యాపారుల ఆగ్రహం



దుకాణాల్లో సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరుచానూరు, జూలై 17: మాంసం, పొగాకు విక్రయాల నిషేధంపై ముందస్తుగా నోటీసులు కూడా ఇవ్వకుండా టీటీడీ అధికారులు సరుకు స్వాధీనం చేసుకోవడం తిరుచానూరులో విమర్శలకు దారితీసింది.వారం రోజుల క్రితం హిందూ సంఘాలు తిరుచానూరులో మాంసం , పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మాంసం, పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా మాడవీధుల్లో వ్యాపారులకు అవగాహన కల్పించాలని పంచాయతీ ఈవోకు టీటీడీ విజిలెన్స్ అధికారులు సూచించినట్లు సమాచారం.తరువాత పంచాయతీ సిబ్బంది మాడ వీధుల్లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి సిగరెట్లు, బీడీలు విక్రయించరాదని చెప్పారు. పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చి, స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాక పొగాకు ఉత్పత్తులపై నిషేధం అమల్లోకి తెచ్చివుంటే బాగుండేది.అలా కాకుండా టీటీడీ ఎస్టేట్ విభాగంలో తహసీల్దారు లలితాంజలి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, పంచాయతీ అధికారులు బుధవారం ఉదయం ఆలయ మాడవీధుల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు.దుకాణాల్లో వున్న సిగరెట్లు, బీడీలను వెలుపల వేసి మూటకట్టి శ్రీవారి సేవకుల ద్వారా విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు.దీంతో దుకాణదారులంతా అక్కడికెళ్లి ముందస్తు సమాచారం లేకుండా అంగళ్లలో సరుకును ఎలా తీసుకెళ్తారంటూ గట్టిగా ప్రశ్నించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దని నోటీసులు ఎప్పుడైనా ఇచ్చారా.. లేదా సమావేశం పెట్టారా.. పోనీ నిషేధం ఏమైనా ఉందా...మీ దగ్గర ఏవైనా ఉత్తర్వులున్నాయా అని ప్రశ్నించడం మొదలెట్టారు.దీంతో వారికి సమాధానం చెప్పలేక తీసుకెళ్లిన పొగాకు ఉత్పత్తులను తిరిగి దుకాణదారులకు ఇచ్చేశారు.

కమనీయంగా శ్రీవారి కల్యాణోత్సవం



సోమల, జూలై 17: మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం వేదపండితులు కమనీయంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు విశేష అలంకరణలు చేయగా చరిష్మ, పవన్‌కుమార్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి అభిషేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదపండితులు శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం జరిపారు. ఉభయదారులుగా కొల్లా స్వాతి, ధనుంజయనాయుడు వ్యవహరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ, బీజేపీ ఇన్‌చార్జులు చల్లా రామచంద్రారెడ్డి, గన్నా మదన్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మంత్రిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జూలై 17: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పెద్దపంజాణి మండలంలోని కత్తార్లపల్లె నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 2.15 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.1.52కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పనులకు బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. దీనితో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కత్తార్లపల్లెలో ఎన్టీఆర్ సుజల స్రవంతిలో భాగంగా ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం ముమ్మరంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకుడు చిన్నారాయల్

పుంగనూరు రూరల్, జూలై17: పుంగనూరు నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టి లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా జనసేన నాయకుడు చిన్నారాయల్ తెలిపారు. బుధవారం ఆయన సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు 10 రోజులపాటు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేయనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు, జూలై 17: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. 9849907885కు నియోజకవర్గ పరిధిలోని వారు ఫోన్ ద్వారా సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. అధికారులు గత వారం అందిన ఫిర్యాదులపై నివేదికతో హాజరుకావాలని కోరారు.

నేడు డీపీఎస్ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం

చిత్తూరు, జూలై 17: దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులపై గురువారం దళిత ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గంగినేని చెరువు పక్కనున్న బాబు జగ్జీవన్‌రామ్ మున్సిపల్ పార్కులో జరిగే ఈ సమావేశానికి దళిత, ప్రజా సంఘాల నేతలు హాజరు కావాలని కోరారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

యాదమరి, జూలై 17: మండల పరిధిలోని కమ్మారాయనిమిట్టకు సమీపంలో గల డాబాలో చిత్తూరు నగరానికి చెందిన యువకులు బుధవారం వీరంగం సృష్టించారు. పార్టీ చేసుకునేందుకు వచ్చిన యువకులు తిని, తాగారు. మద్యం మత్తులో గొడవపడ్డారు. బీరుబాటిళ్లతో కొట్టుకున్నారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐ రామాంజినేయులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి మందలించి, వదిలేశారు. చిత్తూరు-గుడియాత్తం రహదారిలోని ఈ డాబాలో తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. గతంలోనూ యువకులు మద్యం మత్తులో కొట్టుకుని అక్కడికి వచ్చిన పోలీసులపైనా రాళ్ల దాడికి పాల్పడిన ఘటనలున్నాయి. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని ఎస్ఐ తెలిపారు.

నేడు చేనేత హస్తకళా మేళా

చిత్తూరు కల్చరల్, జూలై 17: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గురువారం చేనేత హస్తకళా మేళా ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ, పోచంపల్లె చీరలు, డ్రస్ మెటీరియల్స్, జ్యూయెలరీ, గృహోపకరణాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

25న తలనీలాల వేలం

కార్వేటినగరం, జూలై 17: స్థానిక సుబ్రమణ్యేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలను ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చునని సూచించారు.

రహదారుల మరమ్మతుకు ప్రతిపాదనలు

వెదురుకుప్పం, జూలై 17 : జీడీనెల్లూరు నియోజకవర్గంలో పలు రహదారులపై గుంతలు పూడ్చేందుకు, మరమ్మతులు చేయడానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 14 రహదారుల మరమ్మతులకు రూ.58.05 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు నిధులు మంజూరైతే రోడ్ల మరమ్మతులు చాలా వరకు పూర్తయినట్లేనని అధికారులు చెబుతున్నారు.

కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన

ఐరాల, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ మణికంఠ అన్నారు. బుధవారం ఆయన ఐరాల పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు చేశారు. గ్రామీణులకు పాత చట్టాలపై కొంత మేరకు అవగాహన ఉందని, కొత్తవాటి గురించి తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. నిత్యం ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. చిత్తూరు ఎస్‌డీపీవో రాజగోపాల్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఐరాల ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలపై త్వరలో శ్వేతపత్రం

చిత్తూరు సిటీ, జూలై 17: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రభుత్వం త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.35.576 కోట్ల విలువచేసే 1.75 లక్షల ఎకరాల భూమి ఆక్రమణకు గురైందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. విశాఖలో రామానాయుడు స్టుడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి, రేణిగుంట ప్రాంతంలోని మఠం భూములను, పుంగనూరులో 582 ఎకరాల భూమిని వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని చెప్పారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించారని చెప్పారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృథా చేశారని అన్నారు. ఈ సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

గుడుపల్లె : గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెకు చెందిన వార్డు మెంబర్ శశికళ అమరావతి నిర్మాణానికి కోసం రూ.1000 విరాళం అందించారు. కుప్పం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో కంచెర్ల శ్రీకాంత్, కుప్పం ఇన్‌చార్జ్ సిఎస్ మునిరత్నంను కలిసి చెక్కును అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పల్లెకుప్పంలో కొలువుదీరిన పీర్లు

పుంగనూరు రూరల్, జూలై17: మొహర్రం పర్వదినం సందర్భంగా పుంగనూరులో భక్తిశ్రద్ధలతో ముస్లింలు పీర్ల ఊరేగింపు నిర్వహించారు. బుధవారం స్థానిక కుమ్మరవీధి మక్కా మసీదు మఖాన్ నుంచి మంగళవాయిద్యాలు, బల్లారిడ్రమ్స్ మధ్య ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పీర్లను జమీందార్ల ప్యాలస్ వరకు ఊరేగించారు. భక్తులు చదివింపులు చేసి, ప్రార్థనలు చేయగా, యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వీధులు నిండిపోయారు. అనంతరం కుమ్మరవీధిలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పీర్లు ఎత్తుకుని నడిచారు. అలాగే మండలంలోని కుమ్మరగుంటలో పీర్లను ఊరేగించి ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రామకుప్పం : రామకుప్పం మండలంలో మంగళ, బుధవారాల్లో మొహర్రం వేడుకలు కోలాహలంగా జరిగాయి. గొరివిమాకులపల్లె, ముద్దనపల్లె, పల్లెకుప్పం, చెల్దిగానిపల్లె తదితర గ్రామాల్లో షియా ముస్లింలు పీర్లకు విశేష అలంకరణలు చేయగా ప్రజలు పీర్లకు పూజలు నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో రాత్రిళ్ళు అగ్నిగుండం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. డప్పుల హోరు మధ్య ప్రజలు నృత్యాలు చేస్తూ అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు భక్తులు అగ్నిగుండాల్లో నిప్పులపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి గొరివిమాకులపల్లెల్లో జరిగిన అగ్నిగుండప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణఆచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొహర్రం సందర్భంగా పుంగనూరులో ఊరేగుతున్న పీర్లు, యువత నృత్యాలు

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటరమణస్వామి, చెల్దిగానిపల్లెలో రామకోటి నామస్మరణలో భక్తులు, బైరెడ్డిపల్లెలో బాటగంగమ్మ

పుంగనూరు, జూలై17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం పుంగనూరు, పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు ఉపవాసదీక్షలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆషాడ మాసం శుక్లపక్ష ఏకాదశి తిథి రోజున నారాయణుడు క్షీరసాగరంలో శేష తల్పం మీద నాలుగునెలలపాటు యోగనిద్రకు ఉపక్రమిస్తారని, దీనినే శయనైక ఏకాదశి, తొలి ఏకాదశి అంటారని అర్చకులు తెలిపారు. విశేషమైన ఏకాదశిన విష్ణుమూర్తిని పూజిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామిని అర్చకులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఏడూరు, గూడూరుపల్లె గ్రామాల సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే వెంకటేశ్వర స్వామి, రామాలయాల్లో భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.



రామకుప్పంలో అన్నపూర్ణ, కాశీవిశ్వేశ్వరస్వామి

రామకుప్పం: పట్టణంలోని దేవాలయాల్లో ఏకాదశి పూజలు జరిగాయి. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని, దేవతామూర్తులను దర్శించుకుని అర్చనలు చేయించారు.

చెల్దిగానిపల్లెలో రామకోటి నామస్మరణ

రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో బుధవారం తొలిఏకాదశి పర్వదినాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం స్థానిక సీతారామలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం కళాకారులు అఖండ శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు.

బైరెడ్డిపల్లె : స్థానిక కోదండరామాలయం, శేషాద్రిస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, బాటగంగమ్మ ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకన్నఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

డిసెంబర్‌లోగా పెండింగ్ పనులన్నీ పూర్తి : అమర్



రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న అమరనాథరెడ్డి, వీరాంజనేయస్వామి ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, జూలై 17 : గతంలో పెండింగ్ పడిన అభివృద్ధి పనులన్నిటినీ డిసెంబర్ లోపు పూర్తి చేయడానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చెప్పారు. మండలంలోని నాగిరెడ్డిపల్లెకు రూ.67లక్షలతో నిర్మించనున్న రహదారి పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు, గ్రామస్తులు అమరనాథరెడ్డిని ఘనంగా సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు జైకుమార్, భువనచంద్ర గౌడు, అమరనాథరెడ్డి, అరుణ్, రామమూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. మిట్టపల్లెలో గంగజాతర సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వి.కోట : ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం వి.కోటలో నిర్వహించిన టీడీపీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతానికి భిన్నంగా ఈ దఫా పరిపాలన సాగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తప్పక పరిగణలోకి తీసుకుంటామన్నారు. అనంతరం మండల పరిధిలో కొన్ని బూత్‌లలో మెజారిటీ తగ్గడానికి గల కారణాలపై సమీక్షించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగనాథ్, ఈశ్వర్, జిల్లా అధికారప్రతినిధి రాంబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ధీరజ్, నేతలు ఇక్బాల్, సోము, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

సీఎంగా చంద్రబాబు, పలమనేరు ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలుపొందడంతో వి.కోట మండలం బోడిగుట్టపల్లె సర్పంచు విశ్వనాథ్ ఆధ్వర్యంలో దొడ్డిపల్లె సమీపంలోని వీరాంజనేయస్వామి ఆలయం ఎదుట బుధవారం 1116 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమక్షంలో వీరాంజనేయస్వామికి పార్టీ శ్రేణులు ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. అనంతరం అమరనాథరెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

87 గ్రాముల బంగారం, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప

పాకాల, జూలై 17: పాకాల, పూతలపట్టు మండలాలల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 87 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చంద్రగిరి ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సీఐ శ్రీరాములు, ఎస్సైలు మహేష్‌బాబు, లోకేష్ కుమార్ మంగళవారం సాయంత్రం నేంద్రగుంట అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో పెనుమూరు వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు వస్తూ పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వెంబడించి పట్టుకున్న పోలీసులు వీరు చోరీలకు పాల్పడుతున్న ముఠాగా గుర్తించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వావిళ్లతోటకు చెందిన ఎస్.మురళి(21), ఎస్.బాబు(20), పెనుమూరు మండలం మఠంపల్లె హరిజనవాడకు చెందినహర్షవర్ధన్(22), గంగుపల్లెకు చెందిన ఎం.వరుణ్ కుమార్(22)లు చెడు వ్యసనాలకు బానిసలై ఒంటరిగా వున్న మహిళల మెడలో చైన్ స్నాచింగ్, తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేయడం, గ్యాస్ సిలిండర్లు దొంగలించి విక్రయించి జల్సాలు చేసేవారు. గత నెల నేంద్రగుంట బస్టాపువద్ద ఓ మహిళ మెడలో బంగారు చైన్ లాక్కొని పారిపోతుండగా స్థానికులు గుర్తించి వెంట పడటంతో బైక్ వదిలేసి పారిపోయారు. పెనుమూరులో ఓ ఇంట్లో బంగారు దొంగతనానికి పాల్పడ్డారు. పూతలపట్టు వీర్ల గుడిపల్లె గ్రామంలో మే నెలలో 30 గ్రాముల బంగారు దొంగిలించారు. తవణంపల్లె కామలూరు దగ్గర ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైను దొంగిలించారు. వీరివద్ద నుంచి రూ.5లక్షల విలువైన 87 గ్రాముల బంగారు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

పెద్దపంజాణి ఎస్ఐగా సహదేవి



పెద్దపంజాణి, జూలై 17: పెద్దపంజాణి ఎస్ఐగా సహదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు వీఆర్‌కు బదిలీ కావడంతో దాదాపు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ స్థానానికి పలమనేరులో విధులు నిర్వహిస్తున్న సహదేవిని ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా రామమూర్తి



పుంగనూరు రూరల్, జూలై17: ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడుగా పుంగనూరుకు చెందిన రామమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా పురోహితుల సంఘ నేతలు గౌరీశంకర్ శర్మ, విష్ణుభట్ల జాగన్నాథసోమయాజులు తెలిపారు. ఇటీవల బంగారుపాళ్యం మండలం మొగిలి వద్ద గల శివపార్వతుల గోశాల దేవరకొండలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పుంగనూరుకు చెందిన రామమూర్తికి అవకాశం దక్కడంతో పట్టణ బ్రాహ్మణ సంఘ నాయకులు ఆయనను బుధవారం అభినందించారు.

గుడివంకలో సుబ్రహ్మణ్య స్వామికి ఆడి పూజలు



గుడుపల్లె, జూన్ 17: మండల పరిధిలోని వేపమాను కొండ గుడివంకపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి బుధవారం ఆడి పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి మాలలు ధరించి కోనేరులో స్థానాలు చేసుకొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లా మార్కెట్ కమిటీ కార్యవర్గం ఏకగ్రీవం



లోకేష్, సంజీవ్‌కుమార్

గంగవరం, జూలై 17: ఉమ్మడి చిత్తూరు జిల్లా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా లోకేష్ సంజీవ్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం చిత్తూరులోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పలమనేరు మార్కెట్ కమిటీలో విధులు నిర్వహించే ఏఎంసీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఏఎంఎస్ సూపర్‌వైజర్ లోకేష్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ జిల్లా కమిటీ తీర్మానించింది.

కల్లూరులో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి స్వాగతం




కల్లూరు/సోమల, జూలై 17: మంత్రి రాంప్రసాద్ రెడ్డి తొలిసారి సోమల మండల పర్యటనతో సోమల, అడుసుపల్లె, నంజంపేట, సోమల జయంతి కాలనీల వద్ద ఆయనకు ఎన్డీఏ కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే పులిచెర్ల మండలం కల్లూరు బస్టాండ్‌లో నాయకులు మంత్రిని, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కల్లూరు నాయకులు నూర్ బాషా, అనిల్‌కుమార్, కరుణాకర్, అబ్బాస్, అష్రాఫ్, ఖాదర్‌వల్లీ, రత్నం, రాజేశ్, అన్సర్‌బాషా, అన్వర్‌బాషా, అల్తాఫ్, నాసిర్, యుగంధర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రీతిచానూరులో ఎద్దుల పండుగ

శాంతిపురం, జూన్ 17: శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ ప్రీతిచానూరులో బుధవారం ఎద్దుల (మైలేరు) పండుగ నిర్వహించారు. ఈ పోటీలను చూడడానికి అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేశారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి, రెండవ, మూడవ బహుమలులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 101 ఎద్దులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నాయకులు విశ్వనాథం నాయుడు, జనార్ధన్ రెడ్డి, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, ఆర్‌వీఎస్ మణి, రుద్రప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



శాంతిపురం, జూన్17: కుప్పం నుంచి కేజీఎఫ్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాళ్లబూదుగూరు సమీపంలో అదుపు తప్పడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలకు గురయ్యారు. రాళ్లబూదుగూరు సమీపంలో పెట్రోల్ బంక్ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అతి వేగంతో బస్సుపైకి దూసుకెళ్లడంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డు పక్కను తిప్పడంతో ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది దీంతో బస్సులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు, జూలై 17: చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. 9849907885కు నియోజకవర్గ పరిధిలోని వారు ఫోన్ ద్వారా సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. అధికారులు గత వారం అందిన ఫిర్యాదులపై నివేదికతో హాజరుకావాలని కోరారు.

నేడు డీపీఎస్ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం

చిత్తూరు, జూలై 17: దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులపై గురువారం దళిత ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గంగినేని చెరువు పక్కనున్న బాబు జగ్జీవన్‌రామ్ మున్సిపల్ పార్కులో జరిగే ఈ సమావేశానికి దళిత, ప్రజా సంఘాల నేతలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

21న యాదమరి మండల సమావేశం

యాదమరి, జూలై 17: యాదమరి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో శింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ హాజరవుతారని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించండి

ఐరాల, జూలై 17: విద్యుత్ వినియోగదారులు యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలని ఐరాల ట్రాన్స్‌కో ఏఈ చలపతి కోరారు. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లించేవారని, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చిందని, దాని ద్వారా చెల్లిస్తే సమయం చాలా ఆదా అవుతుందని పేర్కొన్నారు.

టీటీడీ జేఈవోకు సన్మానం



పాలసముద్రం, జూలై 17: టీటీడీ నూతన జేఈవోగా నియమితులైన వెంకయ్య చౌదరిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు విజయవాడలో బుధవారం కలసి సన్మానించారు. టీటీడీలో జరుగుతున్న అవకతవకలను ఆయన గాడిలో పెడతారని చిట్టిబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా అర్జున తపస్సు



పాలసముద్రం, జూలై 17: మండలంలోని బలిజ కండ్రిగ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ తిరునాళ్లలో భాగంగా బుధవారం ఉదయం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం, అర్జున వేషధారి తపస్సుమాను ఎక్కి విబూది పండ్లు విసిరే ఘట్టం ఆకట్టుకుంది. నిమ్మపండ్ల కోసం సంతానం లేని మహిళలు వరపడ్డారు. జి.నీలమ్మ, రఘు, రవి రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, జూలై 17: మండలంలోని నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. బుధవారం తోట హరిబాబు నాయుడు భోజన వితరణ చేశారు. నాయకులు రవినాయుడు, కిట్టు, గురుస్వామి నాయుడు, శంకర్ నాయుడు, ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గుడిపాల, జూలై 17: మండలంలోని కమ్మతిమ్మాపల్లిలో స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కృష్ణమండడి, కన్నమ్మ జ్ఞాపకార్థం వెంకటేశులు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కళ్లు, మెడ, నడుము, మోకాళ్లు, బీపీ, షుగర్‌లకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఉదయ్ కుమార్, జయశ్రీ, గీత, అనూష, నోబెల్‌రావు, దుర్గాప్రసాద్, మహేష్ రెడ్డి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 17: వాతావరణ మార్పులు, తరచూ వర్షాలు కురుస్తున్న క్రమంలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహారం, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



వెంకటేశ్వరాలయంలో భక్తుల సందడి

చిత్తూరు కల్చరల్, జూలై 17: నగరంలోని వైష్ణవాలయాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి, గోదాదేవి, ఆంజనేయ సమేత వెంకటేశ్వరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. విశేషాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. కోదండ రామాలయం, వరదరాజస్వామి, సంతపేట రంగనాథాలయం, రామ మందిరం, వరదరాజ స్వామి, కృష్ణ భజనమందిరం, గోకుల కృష్ణ, శ్రీరామ భజనమందిరం, సీతారామాంజనేయ మందిరాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



తేనెబండలో పీర్లకు ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చిత్తూరు కల్చరల్, జూలై 17: నగరంలో ముస్లింలు బుధవారం మొహర్రం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు, జాలాభిషేకం చేశారు. పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. మతాలకతీతంగా ప్రజలు పీర్లను పూజించారు.

నేడు చేనేత హస్తకళా మేళా

చిత్తూరు కల్చరల్, జూలై 17: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గురువారం కళా సిల్క్స్ చేనేత హస్తకళా మేళా ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ మేళాలో పట్టు, ఫ్యాన్సీ పోచంపల్లి చీరలు, డ్రస్ మెటీరియల్స్, జ్యూయెలరీ, గృహోపకరణాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల పాటు నిర్వహించే ఈ మేళాను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారాహి అమ్మవారి సేవలో న్యాయమూర్తి మాధవి



చిత్తూరు కల్చరల్, జూలై 17: తొలి ఏకాదశిని పురస్కరించుకుని న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలోని వారాహి అమ్మవారిని బుధవారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మాధవి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం ఆలయాధికారులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

25న తలనీలాల వేలం

కార్వేటినగరం, జూలై 17: స్థానిక సుబ్రమణ్యేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలను ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చునని సూచించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

కార్వేటినగరం, జూలై 17: గోల్డ్ మెడల్ సాధించిన శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీ బయో టెక్నాలజీ విద్యార్థులకు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రూ.లక్షా 75 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ జ్యోత్స్నకు బుధవారం చెక్కు అందజేశారు. ఏటా ఈ ప్రోత్సాహాన్ని కొనసాగిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

వైభవంగా గంగ జాతర



విజయపురం, జూలై 17 : మండలంలోని కళియంబాకంలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. వీధుల్లో వేపతోరణాలు కట్టి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆర్చి ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

నాసిరకంగా గోవత్సనాదీశ్వరాలయ పునరుద్ధరణ పనులు

వర్షాలకు కారుతున్న పైకప్పు



ఆలయ పైభాగంలో వేసిన స్లాబ్ కాంక్రీట్‌లో ఉన్న రాళ్లు - స్లాబ్ నుంచి కారుతున్న నీరు

పాలసముద్రం, జూలై 17 : మండలంలోని మఠవలంలో ఉన్న పురాతన గోవత్సనాదీశ్వర స్వామి ఆలయ నిర్వహణను గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు చందాలు వేసుకుని చూసేవారు. ఈ ఆలయానికి మాన్యం భూములు సైతం ఉన్నాయి. ఆలయం పైకప్పు నుంచి నీరు కారుతుండడంతో పునరుద్ధరణ కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి రూ.1.35 కోట్లను ఏడాదిన్నర క్రితం మంజూరు చేయించారు. కడప జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి వదిలిపెట్టేశారు. ప్రస్తుత వర్షాలకు ఆలయంలో ఎక్కడ చూసినా నీరు కారుతోంది. మరమ్మతులు చేయక ముందు ఒకట్రెండు చోట్ల మాత్రమే నీరు కారేదని, ప్రస్తుతం జీర్ణోద్ధరణ పనుల పేరుతో బాగున్న ఆలయాన్ని చెడగొట్టారని ఆలయ కమిటీ సభ్యులు, మఠవలం గ్రామస్తులు కలిసి కలెక్టర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్‌పై, బిల్లులు చెల్లించిన ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

ఐరాల, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ మణికంఠ అన్నారు. బుధవారం ఆయన ఐరాల పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు చేశారు. గ్రామీణులకు పాత చట్టాలపై కొంత మేరకు అవగాహన ఉందని, కొత్తవాటి గురించి తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. నిత్యం ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలపై దృష్టి సారించాలన్నారు. చిత్తూరు ఎస్డీపీవో రాజగోపాల్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఐరాల ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నుంచి వలసలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 17: బ్యాంకింగ్ రంగంలో ఉన్న యూనియన్లలో ఉద్యోగులు ఏదో ఒక దాంట్లో సభ్యులుగా ఉంటారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ స్వేచ్ఛను కోల్పోయారు. ఆ పార్టీ నాయకులు వారిని భయపెట్టి ఆ పార్టీకి మద్దతుగా ఏర్పాటైన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌లోనే కొనసాగాలని షరతు పెట్టారు. అధికారంలో ఉన్నారు కాబట్టి చేసేది లేక ఆ యూనియన్‌లో చేరారు. తద్వారా హక్కుల కోసం పోరాటాలు చేసే అవకాశం కోల్పోయారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు రాజీనామా చేసి, తమ పాత యూనియన్ ఏపీసీసీబీఈఏ (ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్)లో చేరుతు న్నారు. ఈ విషయమై డీసీసీబీ ఉద్యోగ సంఘ నాయకులను ప్రశ్నిస్తే సమాధానం చెప్పేందుకు భయపడుతున్నారు.

వైసీపీ అక్రమాలపై త్వరలో శ్వేతపత్రం : టీడీపీ

చిత్తూరు సిటీ, జూలై 17: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రభుత్వం త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.35,576 కోట్ల విలువచేసే 1.75 లక్షల ఎకరాల భూమి ఆక్రమణకు గురైందన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. విశాఖలో రామానాయుడు స్టుడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి, రేణిగుంట ప్రాంతంలోని మఠం భూములను, పుంగనూరులో 582 ఎకరాల భూమిని వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని చెప్పారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు ప్రయత్నించారని చెప్పారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృథా చేశారని అన్నారు. ఈ సమావేశంలో నేతలు మోహన్ రాజ్, వెంకటేష్ యాదవ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పాళ్యంకొండపై మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న కమిటీ సభ్యులు

గుడిపాల, జూలై 17: ఏఎల్‌పురం సమీపంలోని పాళ్యంకొండపై వెలసిన అంజనేయస్వామి ఆలయాభివృద్ధిలో భాగంగా బుధవారం ఆవరణలో కమిటీ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి జానకిరామ్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు హరి, కమిటీ సభ్యులు డిల్లీ బాబు, రమేష్, నాగేష్, హేమాద్రి, రాజు, గంగాధరం, బాలాజీ, కనకరాజులు, యుగంధర్, హరిప్రసాద్, శేఖర్, నందిని, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

యాదమరి, జూలై 17: మండల పరిధిలోని కమ్మారాయనిమిట్టకు సమీపంలో గల డాబాలో చిత్తూరు నగరానికి చెందిన యువకులు బుధవారం వీరంగం సృష్టించారు. పార్టీ చేసుకునేందుకు వచ్చిన యువకులు తిని, తాగారు. మద్యం మత్తులో గొడవపడ్డారు. బీరుబాటిళ్లతో కొట్టుకున్నారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐ రామాంజినేయులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి మందలించి, వదిలేశారు. చిత్తూరు-గుడియాత్తం రహదారిలోని ఈ డాబాలో తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. గతంలోనూ యువకులు మద్యం మత్తులో కొట్టుకుని అక్కడికి వచ్చిన పోలీసులపైనా రాళ్ల దాడికి పాల్పడిన ఘటనలున్నాయి. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక పాలసీపై రాద్ధాంతం తగదు

గంగాధరనెల్లూరు, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీపై వైసీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని, ఇది సరికాదని తెలుగు యువత జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపల్లి ధనంజయనాయుడు పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ఇసుక మాఫియాను తయారు చేసుకుని, వేలకోట్ల రూపాయలను దోపిడీ చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇసుక ధరల పెంపుతో నిర్మాణ రంగం కుదేలైందని, కార్మికులు పనుల్లేక రోడ్డున పడ్డారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెలరోజుల్లోపే అమలుచేసి నిర్మాణ రంగానికి, కార్మికులకు వెన్నుదన్నుగా నిలిచారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గంగాధరనెల్లూరు, జూలై 17: మండలంలోని వేపంజేరి కోనేటి వద్ద గల సంతాన వెంకటేశ్వరస్వామి, వైకుంఠనాథస్వామి ఆలయల్లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సంతాన వెంకటేశ్వరస్వామికి తిరుపతికి చెందిన ఉడ్‌ల్యాండ్ హోటల్ యజమాని కృష్ణభట్ పేరుతో ఆయన కుమార్తె, అల్లుడు అర్చన, రాజేష్‌లతో పాటు వారి కుటుంబసభ్యులు అభిషేకం చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వైకుంఠనాథస్వామికి బెంగళూరుకు చెందిన సూర్యప్రకాష్ సింహా ఉభయదారుగా పూజలు, అభిషేకం చేయించారు. వారికి ఆయా ఆలయాల సంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలు, స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులు రెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, ద్వివేది, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయ్‌లెట్ ఏర్పాటు చేయండి

గుడిపాల, జూలై 17: గుడిపాలలో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రం కావడంతో తహసీల్దార్, ఎంపీడీవో, ఎమ్మార్సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సింగిల్ విండో, వ్యవసాయ, వెలుగు కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి నిత్యం ప్రజలు వస్తూ ఉంటారని, అత్యవసర పరిస్థితిలో మలమూత్ర విసర్జనకు పబ్లిక్ టాయిలెట్ లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పబ్లిక్ టాయ్‌లెట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వెలగని వీధి దీపాలు

కార్వేటినగరం, జూలై 17: కార్వేటినగరం చిన్న నగరి వీధిలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ కారణంగా ఆ ప్రాంత వాసులు రాత్రిపూట చీకట్లో ఇబ్బంది పడాల్సి వస్తోంది. విష పురుగులు, దొంగల బెడద ఎక్కువగా ఉందని, పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు



బంగారుపాళ్యం, జూలై 17: పలమనేరు - చిత్తూరు జాతీయ రహదారిలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లె వద్ద రెండేళ్లుగా రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉత్తుత్తి హామీలతో కాలం గడుపుతున్నారని, ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగింపు వాహనాన్ని తోలుతున్న ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం, జూలై 17: 49.కొత్తపల్లెమిట్ట గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్, టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ప్రత్యేక పూజలు చేయించారు. సిద్ధయ్యశెట్టి, బాలాజీ నాయుడు, గుండయ్య, జనార్దన్ రాజు, బుల్లెట్ బాబు, దేవరాజులు నాయుడు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- 87 గ్రాముల బంగారం, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప

పాకాల, జూలై 17: పాకాల, పూతలపట్టు మండలాలల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 87 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చంద్రగిరి ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సీఐ శ్రీరాములు, ఎస్సైలు మహేష్‌బాబు, లోకేష్ కుమార్ మంగళవారం సాయంత్రం నేంద్రగుంట అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో పెనుమూరు వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు వస్తూ పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వెంబడించి పట్టుకున్న పోలీసులు వీరు చోరీలకు పాల్పడుతున్న ముఠాగా గుర్తించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వావిళ్లతోటకు చెందిన ఎన్.మురళి(21), ఎస్.బాబు(20), పెనుమూరు మండలం మఠంపల్లె హరిజనవాడకు చెందినహర్షవర్ధన్(22), గంగుపల్లెకు చెందిన ఎం.వరుణ్ కుమార్(22)లు చెడు వ్యసనాలకు బానిసలై ఒంటరిగా ఉన్న మహిళల మెడలో చైన్ స్నాచింగ్, తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేయడం, గ్యాస్ సిలిండర్లు దొంగలించి విక్రయించి జల్సాలు చేసేవారు. గత నెల నేంద్రగుంట బస్టాపువద్ద ఓ మహిళ మెడలో బంగారు చైన్ లాక్కొని పారిపోతుండగా స్థానికులు గుర్తించి వెంట పడటంతో బైక్ వదిలేసి పారిపోయారు. పెనుమూరులో ఓ ఇంట్లో బంగారు దొంగతనానికి పాల్పడ్డారు. పూతలపట్టు వీర్ల గుడిపల్లె గ్రామంలో మే నెలలో 30 గ్రాముల బంగారు దొంగిలించారు. తవణంపల్లె కామలూరు దగ్గర ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైను దొంగిలించారు. వీరివద్ద నుంచి రూ.5లక్షల విలువైన 87 గ్రాముల బంగారు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

రహదారుల మరమ్మతుకు ప్రతిపాదనలు

వెదురుకుప్పం, జూలై 17 : జీడీనెల్లూరు నియోజకవర్గంలో పలు రహదారులపై గుంతలు పూడ్చేందుకు, మరమ్మతులు చేయడానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గంలోని 14 రహదారుల మరమ్మతులకు రూ.58.05 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు నిధులు మంజూరైతే రోడ్ల మరమ్మతులు చాలా వరకు పూర్తయినట్లేనని అధికారులు చెబుతున్నారు.

నేడు స్టూడెంట్ కిట్స్ పంపిణీ

గంగాధరనెల్లూరు, జూలై 17: మండలంలోని నెల్లేపల్లె హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో కాణిపాకం అంజినేయులుశెట్టి తెలిపారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రోగాలకు నిలయం విజయలక్ష్మి కాలనీ



కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ

చిత్తూరు, జూలై 17: నగర పరిధిలోని 46వ డివిజన్‌విజయలక్ష్మి కాలనీలో పారిశుధ్యం లోపించింది. 5వ క్రాస్‌లో మురికినీటి కాలువ, కల్వర్టు నిర్మించకపోవడంతో వ్యర్థ నీరంతా వీధిలో ప్రవహిస్తోంది. దోమల బెడద కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సిమెంటు రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో వీధంతా బురదమయంగా తయారవుతోంది. ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగుల బెడద ఎక్కువగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.